క్లుప్తంగా

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అశోక్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో బాలింతలకు, గర్భిణులకు సోమవారం పౌష్టికాహారాన్ని వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పంపిణీ చేశారు. కార్పొరేటర్ సురేష్ మాట్లాడుతూ రక్తహీనత సమస్యతో బాధపడుతున్న బాలింతలు ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం ప్రతి నెలా అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆడారి హరీష్,నేవీ అనీల్,అంగనవాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జీవీఎస్ఎన్ రాజు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జీవీఎంసీ ప్రైమరీ పాఠశాల పక్కన, జాలరవీధి వద్ద సుమారు రూ. 25 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను వార్డు పార్టీ అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు)సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఈ ప్రాంతంలో ఇబ్బందులను పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఈ రెండు ప్రాంతాల్లో సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయించారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: గోపాలపట్నంలోని వేణుగోపాల స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండబాబు, రాజు, సంతోష్ కుమార్, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, వేణు, మాధవ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: అనాథ శవానికి మమత చారిటబుల్ ఆధ్వర్యంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. వేపగుంట పోలమాంబ గుడి వద్ద ఫుట్‌ఫాత్‌పై జీవనం సాగిస్తున్న వ్యక్తిని బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌కు తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. ఆ వృద్ధుడికి కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేకపోవడంతో షెల్టర్ మేనేజర్ మమత తగిన సపర్యలు చేశారు. అతని ఆరోగ్యం బాగా లేకపోవడంతో మానసిక ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవ్వరూ లేకపోవడంతో ఎయిర్‌పోర్టు పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు ఎల్లేటి మమత అంత్యక్రియలు నిర్వహించారు.

కొండవాలుకు మహర్దశ

- నాడు దారి లేక ఇబ్బందులు
- నేడు విశాలమైన మెట్ల మార్గాలు
- రూ. 35 లక్షలతో నిర్మాణం
- గణపతినగర్ కొండవాలు ప్రాంత వాసుల హర్షం

నాడు: కొండ ప్రాంతాల్లో మెట్ల మార్గాలు సరిగ్గా లేక ఆయా ప్రాంత వాసులు ఇబ్బంది పడే రోజులు. రాత్రి అయితే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. ఎంత ఇబ్బందికర పరిస్థితి అయినా ఇంట్లోనే ఉండాల్సిన దుస్థితి.

నేడు: ఆ పరిస్థితికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. ఎంత రాత్రి అయినా దర్జాగా ఇంటి నుంచి బయటకు వచ్చే విధంగా ఆయా ప్రాంతాల్లో లక్షల వ్యయంతో విశాలమైన మెట్ల మార్గాలు నిర్మించింది. దీంతో ఆయా ప్రాంత వాసులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్ కొండ ప్రాంతంలో సుమారు 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరంతా వలస కార్మికులు. వివిధ జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి వివిధ పరిశ్రమల్లో, భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేసుకుంటున్నారు. 20 ఏళ్ల కిందట వీరు కొండ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని, జీవనం సాగిస్తున్నారు. వీరు తమ ఇళ్లకు వెళ్లేందుకు సరైన మార్గం లేక ఇబ్బందులు పడేవారు. తుప్పలు, బండ రాళ్లను దాటుకుని ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. రాకపోకలు సాగించేందుకు అవసరమైన మెట్ల మార్గాలు ఏర్పాటు చేయాలని, శిథిలమైన మార్గాలకు మరమ్మతులు చేపట్టాలని గత, ప్రస్తుత ఎమ్మెల్యే గణబాబుకు అనేక మార్లు విన్నవించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది.



గణపతినగర్ కొండ ప్రాంతంలో మెట్ల మార్గం దుస్థితి



రూ.15 లక్షలతో గణపతినగర్ నిర్మించిన మెట్ల మార్గం



శివాలయంపైన కొండ ప్రాంతానికి వెళ్లే మార్గం



శివాలయంపై గల కొండ ప్రాంతంలో రూ. 20 లక్షలతో వేసిన మెట్ల మార్గం

గడప గడపకు మన ప్రభుత్వంతో కదలిక

గతేడాది చివరిలో ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్ ద్వారా గణపతినగర్ కొండ ప్రాంత వాసులు సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆనంద్‌కుమార్ వెంటనే అధికారులతో మాట్లాడి సుమారు రూ.35 లక్షలతో ఇక్కడ కొండ ప్రాంతంలో సీసీ మెట్ల మార్గాలు వేయించారు.

మూడు నెలల్లో పనులు చేపట్టాం



గణపతినగర్ కొండ ప్రాంతం కావడంతో ఇక్కడ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదు. నేను ప్రత్యేక దృష్టి పెట్టి కాంట్రాక్టర్లను ఒప్పించి మూడు నెలల వ్యవధిలో మెట్ల మార్గాలను వేయించాం. సీసీ కాలువ నిర్మాణ పనులు పూర్తి చేశాం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

కష్టాలు చూశాను



గణపతినగర్ ప్రాంతంలో పర్యటించినపుడు కొండ ఎక్కడానికి చాలా ఇబ్బంది పడ్డాను. ఒక రోజుకే ఇంత ఇబ్బంది పడ్డానే అంటే రోజూ ఇక్కడి వారు ఎంత ఇబ్బందులు పడుతున్నారో అని ఆవేదన చెందాను. దీంతో ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి స్వయంగా సమస్యను తీసుకు వెళ్లాను. ఆయన స్పందించి తక్కువ వ్యవధి ఈ ప్రాంతవాసుల కష్టాలు తీర్చారు.

– పుర్రె పూర్ణశ్రీయాదవ్, కార్పొరేటర్

మార్గం చూపారు



మా కొండ ప్రాంతంలో సరైన మార్గం లేక ఇబ్బందులు పడేవారం . దీనికి తోడు నడిచే దారిలో విద్యుత్ సౌకర్యం లే రాత్రి అయితే ఇంటికే పరిమితం అవ్వాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు.విశాలమైన మెట్ల మార్గం,వీధి కాలువలు,విద్యుత్ లైట్లు సౌకర్యం కల్పించారు.

–ఖాన్, గణపతినగర్ కొండ ప్రాంతం

ఆనంద్‌కుమార్ స్పందించారు



మా ప్రాంతంలో రాకపోకలు సాగించేందుకు చాలా ఇబ్బందులు పడేవాళ్లం. మా ఇంటికి వెళ్లే సీసీ మెట్ల మార్గం పూర్తిగా శిథిలావస్థకు చేరి చాలా ఇబ్బందిగా ఉండేది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఇక్కడకు వచ్చిన ఆడారి ఆనంద్‌కుమార్‌కు మా ప్రాంతంలో సమస్య వివరించాం. ఆయన స్పందించి మెట్ల మార్గానికి మరమ్మతులు చేయించారు.

– అన్నపూర్ణ, గణపతినగర్ కొండ ప్రాంతం

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు



ముస్లిం కమ్యూనిటీ హాలు వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 89వ వార్డులో నిర్మించిన మూడు కమ్యూనిటీ హాళ్లను సోమవారం ఆయన ప్రారంభించారు. చేపల కాలనీ, నాగేంద్ర కాలనీ ముస్లిం కమ్యూనిటీ హాలు, సంతోష్‌నగర్ కమ్యూనిటీహాళ్ల వద్ద శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఒక్కో కమ్యూనిటీ హాలుకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేయించి నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, గేదెల మురళీకృష్ణ, మళ్ల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, నాయకులు దొడ్డి కిరణ్, దాడి భాస్కరరావు, షేక్‌రహమాన్, గవర నాయుడు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తాం



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్

విశాఖ విద్య: స్పందనలో వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు తగిన శ్రద్ధ తీసుకుంటున్నామని గోపాలపట్నం తహసీల్దార్ పి. విజయభాస్కర్ అన్నారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించారు. సచివాలయం స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. తమ వద్దకు వచ్చే వాటిని కూడా సకాలంలో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. హుద్-హుద్ లబ్ధిదారుల ఇళ్లకు సంబంధించిన విచారణ నివేదికను సకాలంలో జిల్లా కలెక్టర్‌కు పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గోపాలపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

చైతన్యంతోనే మార్పు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత చలపతిరావు

మల్కాపురం: పౌరులు చైతన్యవంతులైనప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని ప్రముఖ పాత్రికేయుడు, కవి, రచయిత సుంకర చలపతిరావు అన్నారు. జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువతరం ప్రజలను అన్ని రంగాల్లో చైతన్యపరచాలన్నారు. బలమైన ప్రతిపక్షం, పత్రికా స్వాతంత్ర్యం, స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థ, ప్రాథమిక హక్కులు ప్రజాస్వామ్యానికి ఊపిరి వంటివన్నారు. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది విశ్వనాథ్, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, గ్రంథాలయాధికారి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన కార్యకర్తలు



పార్టీలో చేరిన వారితో ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్ తదితరులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డులకు చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన జనసేన కార్యకర్తలు మేడిశెట్టి శ్రీను, సురేష్, నరేష్, దుర్గారావు తదితరులకు ఆనంద్‌కుమార్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తీరు నచ్చక ఆ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. ఒక ఎజెండా లేని నాయకుడు ఈ రాష్ట్రానికి పనికి రాడని జనసేన పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారని, అందువల్లనే ఆ పార్టీని వీడి తమ పార్టీకి వస్తున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీని నమ్ముకుని వచ్చిన ప్రతి ఒక్కరికీ తప్పక న్యాయం చేస్తామన్నారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పార్టీ నాయకుడు బిల్డర్ సంతోష్ సమక్షంలో సుమారు 50 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, ధనలత, నూకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



పిలకవానిపాలెం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



మాజీ సైనిక కాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



పట్టాలు అందజేస్తున్న నమ్మి శ్రీను, ప్రసాదరెడ్డి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో లబ్ధిదారులకు సోమవారం సెంటు భూమి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. 58వ వార్డులో పిలకవానిపాలెం సామాజిక భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డ్ డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజు, జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కల జగనన్నతో సాకారమైందన్నారు. కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

- 59వ వార్డు మాజీ సైనిక కాలనీ వద్ద వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూసీడీ సీవో రమణ, పార్టీ నాయకులు అమరావతి, రాజు, బొబ్బిలి లక్ష్మి, బ్రహ్మారెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని అల్లూరి సీతారామరాజుకాలనీ, దుర్గానగర్-4, జాలరివీధి సచివాలయాల పరిధిలోని జగనన్న కాలనీ స్థల లబ్ధిదారులకు సోమవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

విశాఖ విద్య: అర్హులందరికీ సొంత ఇంటి కల సాకారం చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయమని వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి శ్రీను, చుక్క ప్రసాదరెడ్డి అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని గొల్లవీధిలో సోమవారం జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్ కుమార్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఆడారి ఆనంద్ కుమార్‌ను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పేదల అభ్యున్నతికి కట్టుబడిన సీఎం

- వారి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాల అమలు
- వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్



సచివాలయ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింధియా: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. ఎన్నికల హామీలను శతశాతం నెరవేర్చిన సీఎంగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్ సచివాలయ అధికారులతో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో క్లస్టర్ జేకేసీ ఇన్‌చార్జి భోగవిల్లి నాగభూషణంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి చేకూరక అనేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దోచుకుని, దాచుకున్నదే ఎక్కువ అని విమర్శించారు. పేదలకు ఇళ్లు ఇస్తానని చెప్పి వారి చేత డబ్బులు కట్టించుకుని మోసం చేశారన్నారు. రూపాయి లాభం ఆశించకుండా పేదలకు ఇళ్లు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై కోర్టులో కేసులు పెట్టి ఆపే ప్రయత్నం చేశారని, కానీ న్యాయం గెలిచి నేడు పేద ప్రజలకు సీఎం ఉచితంగా ఇళ్లు అందిస్తున్నారన్నారు. 63వ వార్డు పరిధిలోని సుమారు 260 మంది టిడ్కో గృహ లబ్ధిదారులకు, సెంటు ఇంటి స్థలం పొందిన 350 మంది లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఇంటి తాళాలు, రిజిస్ట్రేషన్ పట్టాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు, సెక్రటరీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీలో గర్భిణులకు సోమవారం ప్రత్యేక వైద్య సేవలు అందించారు. యూపీహెచ్‌సీ పరిధిలోని కాలనీల నుంచి సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు తీసుకొచ్చిన గర్భిణులకు డాక్టర్ రొంగలి రేవతి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. ఆస్పత్రికి సేవలు పొందేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. బీపీ, ఇతర రక్త పరీక్షలను నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య పరమైన జాగ్రత్తల గురించి డాక్టర్ రేవతి తెలియజేశారు. కాన్పు అయ్యేంత వరకు వైద్యుల సూచనలకు అనుగుణంగా తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యపరమైన ఇబ్బంది ఎదురైతే ఆరోగ్య కార్యదర్శిని సంప్రదించాలన్నారు.

'ఎన్నికల బాండ్ల జాబితా బహిర్గతం చేయాలి'

మల్కాపురం: ఎన్నికల బాండ్ల జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ మల్కాపురంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద సీపీఎం నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. సీపీఐ మల్కాపురం జోన్ నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు ఏ రాజకీయ పార్టీకి ఎంత వచ్చాయన్న వివరాలను మార్చి 15వ తేదీ నాటికి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచాలని సుప్రీం కోర్టు ఆదేశించిందన్నారు. అయితే ఆ ఆదేశాలను పక్కన పెట్టి ఎస్‌బీఐ మూడు నెలల టైమ్ కావాలని అడగటం వెనుక మాయ ఏమిటో అర్థం అవుతోందన్నారు. కోర్టు తీర్పును గౌరవించి ఎన్నికల బాండ్ల జాబితా విడుదల చేయాలని లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సూర్యనారాయణ, రాంబాబు, రాము, సూరిబాబు పాల్గొన్నారు.

గోపాలపట్నం ఎస్‌బీఐ వద్ద..

గోపాలపట్నం: ఎన్నికల బాండ్లు బహిర్గతం చేయాలని కోరుతూ సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గోపాలపట్నం ఎస్‌బీఐ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం సీనియర్ నాయకుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు ఎస్‌బీఐ మళ్లీ 3 నెలలు గడువు కోరడం సరికాదన్నారు. సీపీఎం జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించడానికి 24 గంటలు చాలన్నారు. కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు విజయలక్ష్మి, వి.ప్రభావతి, లీలావతి, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'సురక్ష'లో గుర్తించిన వారికి కళ్లజోళ్ల అందజేత

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ పరిధిలో రోగులకు సోమవారం కళ్లజోళ్లు అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు సరఫరా చేసింది. వీటిని వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ప్రత్యేక యాప్‌లో లైవ్ లోకేషన్‌తో పాటు నమోదు చేస్తూ లబ్ధిదారులకు వాటిని అందజేస్తున్నారు.

అజాగ్రత్తగా డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

సింహాచలం: అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ అన్నారు. అడవివరం నుంచి గోపాలపట్నం మార్గంలో ఇటీవల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులు మృతి చెందడంతో హెవీ వెహికల్ డ్రైవర్లు, యజమానులకు సింహాచలంలోని ఒక కల్యాణమండపంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. నిర్ణీత సమయంలో మాత్రమే అడవివరం మార్గంలో హెవీ వెహికల్స్‌కి అనుమతి ఉంటుందని, ఆసమయాల్లోనే రాకపోకలు సాగించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పశ్చిమ ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.